
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
మంగళవారం 4 జూన్ 2024




పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుపై శిక్షణను పరిశీలిస్తున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ

నేడే కౌంటింగ్



- సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు
- ముందుగా పోస్టల్ బ్యాలెట్లు... తర్వాత ఈవీఎంలు..
- అంతటా మోహరించిన పోలీసు బలగాలు
- ఏజెంట్లను అప్రమత్తం చేసిన రాజకీయపార్టీలు
- మరికొన్ని గంటల్లో తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

సార్వత్రిక ఎన్నికల ఫలితాల తీర్పు మంగళవారం వెలువడనుంది. ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టిన.. మరికొన్ని గంటల్లోనే అభ్యర్థుల్లో విజేతలెవరన్నది స్పష్టత రానుంది. ఏ పార్టీ కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నదీ.. ముఖ్యమంత్రి ఎవరన్నదీ.. నేడు తేలనుంది. ఎచ్చెర్లలో శివానీ ఇంజినీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూమ్ వద్ద.. ఓట్ల లెక్కింపునకు సంబంధించి అధికార యంత్రాంగం పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తిచేసింది. ఫలితాలపై అభ్యర్థులతో పాటు సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. జిల్లాలో శ్రీకాకుళం పార్లమెంట్‌తో పాటు ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు గత నెల 13న పోలింగ్ నిర్వహించారు. 14,17,959 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా 25,826 మంది ఓటేశారు. శ్రీకాకుళం, ఇచ్ఛాపురం, ఎచ్చెర్ల, పలాస, నరసన్నపేట, టెక్కలి, పాతపట్నం, ఆమదాలవలస అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 86 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. టీడీపీ, వైసీపీ అభ్యర్థుల మధ్యనే ప్రధాన పోటీ ఉంటుంది. కూటమి పొత్తులో భాగంగా ఎచ్చెర్లలో బీజేపీ అభ్యర్థిగా టికెట్ కేటాయించారు. దీంతో ఇక్కడ బీజేపీ, వైసీపీ మధ్య పోటీ ఉంటుంది. శ్రీకాకుళం లోక్‌సభ స్థానానికి 13 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. టీడీపీ నుంచి శ్రీకాకుళం సిట్టింగ్ ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, వైసీపీ నుంచి పేరాడ తిలక్ పోటీ చేశారు. వీళ్లందరి భవిత నేడు వెల్లడికానుంది.

లాడ్జిలన్నీ హౌస్‌ఫుల్

జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న శివానీ కళాశాలలో ఓట్ల లెక్కింపు చేపట్టనుండడంతో.. ప్రధాన పార్టీల అభ్యర్థులు, వారి ఏజెంట్లు సోమవారం సాయంత్రం శ్రీకాకుళం చేరుకున్నారు. అన్ని లాడ్జీల్లో మకాం వేసేశారు. వేకువజామున ఆరుగంటలకే ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాల్సి ఉంది. అప్రమత్తంగా ఉండాలని.. వైసీపీ కవ్వింపు చర్యలకు పాల్పడే అవకాశముందని.. జాగ్రత్త వహించాలని ఈ సందర్భంగా టీడీపీ అభ్యర్థులు.. వారివారి ఏజెంట్లకు సూచించారు. ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదుచేయాలని సూచించారు. మెజార్టీ సంస్థల ఎగ్జిట్ పోల్స్ కూటమి విజయం ఖాయమని చెప్పడంతో.. టీడీపీ-జనసేన-బీజేపీ అభ్యర్థులు జోష్‌తో ఉన్నారు. వైసీపీ అభ్యర్థుల్లో మాత్రం గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.


పోస్టల్‌బ్యాలెట్ లెక్కింపుపై జడ్పీలో శిక్షణ

మోహరించిన పోలీసు బలగాలు

కౌంటింగ్ నేపథ్యంలో రాజకీయపార్టీల అనుచరుల మధ్య వివాదాలు జరగకుండా.. ఎటువంటి అల్లర్లు జరగకుండా పోలీసు బలగాలు మోహరించాయి. ప్రత్యేక దళాలైన సీఏస్ఎఫ్, సీఆర్పీఎఫ్, సీఐఎస్ఎఫ్ బలగాలు జిల్లాకు చేరుకున్నాయి. కౌంటింగ్ ప్రాంతంతోపాటు జిల్లాలో అన్ని నియోజకవర్గాల కేంద్రాల్లోలోనూ.. ప్రధాన సెంటర్ల వద్ద పోలీసులు మోహరించారు. సివిల్ సీఐ, ఎస్ఐలు స్టేషన్ల వారీగా విధులు నిర్వహిస్తూ.. స్థానికంగా అసాంఘీక కార్యకలాపాలు జరగకుండా ముందస్తుగా నిఘా పెట్టారు.

● ఉదయం 8 గంటల నుంచి లెక్కింపు...

ఏ ఎన్నికలకూ లేనంతగా ఈ దఫా పోస్టల్ బ్యాలెట్ల ఓట్లకు ప్రత్యేకత సంతరించుకుంది. జిల్లాలో 25,826 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేశారు. అధిక శాతం పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వైసీపీకి వ్యతిరేకంగా పోలయ్యాయని తెలుస్తోంది. ఆ ఓట్లతోపాటు.. ఆయా కుటుంబాల ఓట్లు కూడా ఎన్నికల ఫలితాలలో ప్రభావితం చేస్తాయని ప్రజలందరూ భావిస్తున్నారు. ఇదిలా ఉండగా.. మంగళవారం ఉదయం 8 గంటలకు పోస్టల్‌బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుంది. అరగంటలో బ్యాలెట్ ఓట్ల లెక్కింపు పూర్తవుతుంది. అనంతరం 8.30 గంటల నుంచి ఈవీఎంల ద్వారా ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. రౌండ్ల వారీగా ఓట్ల లెక్కింపు చేపట్టి.. ప్రతి రౌండ్ ఫలితాలను వెల్లడిస్తారు. ఈవీఎంలో నిక్షిప్తమైన ఓట్లను లెక్కింపు ప్రక్రియ చేపట్టేందుకు 9 మంది రిటర్నింగ్ అధికారులు, 77 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, 492 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 582 మంది కౌంటింగ్ అసిస్టెంట్‌లు, 397మంది మైక్రో అబ్జర్వర్లు, 439 మంది క్లాస్-4 ఉద్యోగులు.. మొత్తం 1996 మంది సిబ్బందిని వినియోగిస్తున్నారు.

పోస్టల్ బ్యాలెట్ పారదర్శకంగా లెక్కించాలి

- కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్, జూన్ 3: 'ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి పోస్టల్‌బ్యాలెట్ లెక్కింపును పూర్తి అవగాహనతో చేపట్టాలి. పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా నిర్వహించాల'ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియపై సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో అధికారులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. పోస్టల్‌బ్యాలెట్ లెక్కింపు ప్రక్రి యలో ఫారం-13సి, ఫారం-13ఏ, ఫారం-13బికు సంబంధించిన అంశాలను కలెక్టర్ వివరించారు. సర్వీసు ఓటర్లకు సంబంధించి బ్యాలెట్ల లెక్కింపులో జాగ్రత్త వహించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.గణపతిరావు, జడ్పీ సీఈవో వేంకటేశ్వరరావు, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఈవీఎంలు భద్రం

● తొలిఫలితం ఆమదాలవలసతో...

పోలింగ్ స్టేషన్ల ఆధారంగా రౌండ్లను ఏర్పాటు చేసి ఈవీఎంల ద్వారా ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపడతారు. మొత్తం 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 112 ఈవీఎం టేబుళ్లు, 29 పోస్టల్ బ్యాలెట్ టేబుళ్లను ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం పార్లమెంట్ స్థానానికి సంబంధించి 98 ఈవీఎం టేబుళ్లను, 29 పోస్టల్ బ్యాలెట్ టేబుళ్లను సిద్ధం చేశారు. ఆమదాలవలస నియోజకవర్గానికి సంబంధించి కేవలం 19 రౌండ్లలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయి.. తొలి ఫలితం వెల్లడి కానుంది. ముందుగా 'ఆమదాలవలస' విజేత ఎవరన్నదీ స్పష్టమవుతుంది. ఆ తర్వాత శ్రీకాకుళం, ఎచ్చెర్ల, పలాస, ఇచ్ఛాపురం, టెక్కలి, నరసన్నపేట నియోజకవర్గాల ఫలితాలు వెల్లడవుతాయి. చివరాఖరున పాతపట్నం నియోజకవర్గం లెక్క తేలుతుంది. ఎంపీ ఓట్ల లెక్కింపు ప్రక్రియ మాత్రం అర్ధరాత్రి వరకూ కొనసాగే అవకాశం ఉంది.


శిక్షణకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎన్నికల పరిశీలకుడు శేఖర్ విద్యార్థి

సూక్ష్మ పరిశీలకుల పాత్ర అత్యంత కీలకం

- ఎన్నికల పరిశీలకుడు శేఖర్ విద్యార్థి

కలెక్టరేట్, జూన్ 3: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర అత్యంత కీలకమని ఎన్నికల పరిశీలకుడు శేఖర్ విద్యార్థి పేర్కొన్నారు. మంగళవారం ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించి సోమవారం స్థానిక అంబేడ్కర్ ఆడిటోరియంలో సూక్ష్మపరిశీలకులకు రెండో విడత శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్‌తో కలిసి.. ముఖ్యఅతిథిగా ఎన్నికల పరిశీలకుడు శేఖర్ విద్యార్థి పాల్గొని మాట్లాడారు. 'ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆరునెలలుగా అధికారులు, సిబ్బంది శ్రమించారు. సమష్టి కృషితో ఓట్ల లెక్కింపును కూడా శాంతియుతంగా నిర్వహించేలా పనిచేయాలి. లెక్కింపు కేంద్రాల్లో ప్రతి టేబుల్ వద్ద ఒక సూక్ష్మపరిశీలకుడిని నియమించాం. పోస్టల్‌బ్యాలెట్, ఈటీపీబీఎస్, ఈవీఎంలలో ఓట్లు, వీవీ ప్యాట్స్ ఓటరు స్లిప్పుల లెక్కింపును సూక్ష్మ పరిశీలకులు అత్యంత నిశితంగా పరిశీలించాలి. ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి సెల్‌ఫోన్లకు అనుమతి లేదు. ప్రతీ ఒక్కరికి గుర్తింపు కార్డు తప్పనిసరి. విధి నిర్వహణలో అందరూ అప్రమత్తంగా ఉండాల'ని శేఖర్ విద్యార్థి ఆదేశించారు. కార్యక్రమంలో తలత్ పర్వేజ్ ఇక్బాల్ రోహిల్, ఎం.ఎస్ సంగమ్, అనూజ కుమార్ దాస్, అశోక్‌కుమార్, ఎస్.సంగీత, ఆజీజ్ శుక్లాదాస్, మాస్టర్ ట్రైనర్ శేషగిరి, ఎల్‌డిఎం సూర్యకిరణ్, విశ్వమోహన్‌రెడ్డి, సూక్ష్మ పరిశీలకులు పాల్గొన్నారు.

పటిష్ఠ భద్రత ఏర్పాటు

- ఎస్పీ జీఆర్ రాధిక

గుజరాతీపేట, జూన్ 3: ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద పటిష్ఠ భద్రత ఏర్పాటు చేశామని ఎస్పీ జీఆర్ రాధిక తెలిపారు. సోమవారం ఎచ్చెర్లలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో పోలీసు అధికారులు, సిబ్బందితో ఆమె సమావేశమయ్యారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద, పరిసర ప్రాంతాల్లో బందోబస్తు నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ప్రతి ఒక్కరూ సమన్వయంతో వ్యవహరిస్తూ.. సమర్థవంతంగా ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ సాగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కౌంటింగ్ సెంటర్‌లోకి ప్రవేశించిన ప్రతి ఒక్కరికీ క్షుణ్ణంగా తనిఖీ చేసి, గుర్తింపు కార్డు పరిశీలించి అనుమతించాలన్నారు. ఏజెంట్లు, అభ్యర్థులను వారికి కేటాయించిన మార్గాల ద్వారా లోపలికి పంపించాలని తెలిపారు. ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను లోపలికి తీసుకెళ్లేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. 144సెక్షన్ పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. రాజకీయ నేతల విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాల నిర్వహణకు వీలు లేదన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ జి.ప్రేమ్‌కాజల్, డి.గంగాధరం, వి.ఉమామహేశ్వరరావు, డీఎస్పీలు వై.శృతి, ఎ.త్రినాథరావు, శ్రీనివాసరావు, ఎల్.శేషాద్రి నాయుడు, రాజారావు, సీఐలు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.


పోలీసులకు సూచనలిస్తున్న ఎస్పీ రాధిక



కూలిన ఆస్పత్రి శ్లాబు

సరుబుజ్జిలిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మసీ గది శ్లాబు పైకప్పు సోమవారం కూలిపోయింది. శ్లాబు పై పెచ్చుతోపాటు సీలింగ్ కూడా ఊడిపోయింది. ఆ సమయానికి ఆరోగ్య సిబ్బంది మరోగదిలో ఉండడంతో పెద్ద ప్రమాదం తప్పింది. దీంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

- సరుబుజ్జిలి

యూరియా.. కరువే

- డీలర్ల దోపిడీ
- ఆందోళనలో రైతులు



(టెక్కలి)

ఖరీఫ్ సీజన్‌లో ఏటా వ్యవసాయశాఖ ముందస్తు చర్యలు చేపట్టినా యూరియా కరువు తప్పడం లేదు. రైతుభరోసా కేంద్రాల్లో యూరియా దొరక్కపోవడంతో రైతులు ప్రైవేటు డీలర్లను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా ప్రైవేట్ డీలర్లు బస్తాకు రూ.50 అదనంగా వసూలు చేసి.. రైతులపై అదనపు భారం మోపుతున్నారు. జిల్లాలో సోంపేట సబ్‌డివిజన్ పరిధిలో 35,538 ఎకరాలు, పలాస సబ్‌డివిజన్‌లో 53,468 ఎకరాలు, టెక్కలి సబ్‌డివిజన్‌లో 94,001 ఎకరాల్లో వరి పండిస్తున్నారు. అలాగే శ్రీకాకుళం సబ్‌డివిజన్‌లో 58,397 ఎకరాలు, రణస్థలం సబ్‌డివిజన్‌లో 59,437 ఎకరాలు, నరసన్నపేట సబ్ డివిజన్‌లో 78,868 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. రణస్థలం మండలంలో అత్యధికంగా, కంచిలి మండలంలో అత్యల్పంగా ఎరువులు వినియోగిస్తున్నారు. కాగా.. అవసరం తగ్గట్టు ఎరువులు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో ఖరీఫ్ సీజన్ నాటికి 15,157 మెట్రిక్‌టన్నుల యూరియా, 5,202 మెట్రిక్‌టన్నుల డీఏపీ, 571 మెట్రిక్‌టన్నుల పొటాష్, 1,351 మెట్రిక్‌టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 143 మెట్రిక్‌టన్నుల ఎస్ఎస్‌పీ ఎరువులు అవసరమని వ్యవసాయశాఖ అధికారులు ఇప్పటికే ప్రణాళికలు రూపొందించారు. ప్రస్తుతం 11,540 మెట్రిక్‌టన్నులు యూరియా, 1,705 మెట్రిక్‌టన్నుల డీఏపీ, 554 మెట్రిక్‌టన్నుల పొటాష్, 1,136 మెట్రిక్‌టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 465 మెట్రిక్‌టన్నుల ఎస్ఎస్‌పీ ఎరువు.. మొత్తంగా 15,400 మెట్రిక్‌టన్నుల ఎరువుల నిల్వలు ఉన్నట్టు చెబుతున్నారు. జిల్లాలోని 650 రైతుభరోసా కేంద్రాల్లో 3,300 మెట్రిక్ టన్నుల యూరియా, 500 మెట్రిక్‌టన్నుల డీఏపీ ఎరువులను పంపిణీకి సిద్ధం చేశారు. మార్క్‌ఫెడ్ ద్వారా అదనంగా మరో 2,500 మెట్రిక్‌టన్నుల యూరియాను అందుబాటులో ఉంచారు. అయినప్పటికీ ఏటా యూరియా కొరత తమకు తప్పడం లేదని రైతులు పేర్కొంటున్నారు. వ్యవసాయశాఖ అధికారులు ముందస్తుగా స్పందించి.. యూరియా సరఫరాలో సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరుతున్నారు.


యూరియా నిల్వలు (ఫైల్)


రైతుభరోసా కేంద్రం

కొరత రాకుండా చూస్తాం..



జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో ఎరువుల కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటాం. యూరియా 65 శాతం ప్రొడక్షన్ విదేశాల నుంచి గంగవరం, కాకినాడ, క్రిష్ణపట్నం తదితర పోర్టుల్లో దిగుమతి అవుతుంది. అక్కడ నుంచి యూరియాను ఆయా రైతుభరోసా కేంద్రాలకు సబ్‌డివిజన్ల వారీగా పంపిస్తాం. గత ఏడాది రష్యా, ఉక్రెయిన్‌యుద్ధం వలన యూరియా కొరతతో కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నాం. యూరియాతో పాటు డీఏపీ, పొటాష్ వంటి ఎరువులు కూడా దిగుమతి చేసుకోవాల్సి వచ్చింది. ఈసారి బఫర్‌స్టాక్ నిల్వలు ద్వారా కొంతమేరకు ఆ సమస్యను అధిగమిస్తాం.

-శ్రీధర్, వ్యవసాయశాఖ జేడీ

జిల్లాలో ఇదీ పరిస్థితి..

ఖరీఫ్‌లో కావాల్సిన ఎరువులు	22,604 మెట్రిక్ టన్నులు
ప్రస్తుతం ఉన్న నిల్వలు	15,400 మెట్రిక్ టన్నులు
అవసరమైన యూరియా	15,157 మెట్రిక్ టన్నులు
ప్రస్తుతం ఉన్న నిల్వలు	11,540 మెట్రిక్ టన్నులు
అవసరమైన డీఏపీ ఎరువు	5,202 మెట్రిక్ టన్నులు
ప్రస్తుతం ఉన్న నిల్వలు	1,704 మెట్రిక్ టన్నులు

వేసవి భృతి ఏదీ?

- ఉపాధి కూలీలకు అందని అదనపు వేతనం
- ఆందోళన చెందుతున్న వేతనదారులు

(ఇచ్ఛాపురం)

ఉపాధిహామీ కూలీలకు వేసవిభృతి కరువవుతోంది. పనిచేసే చోట కనీస సౌకర్యాలు లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. వేతనాలు కూడా సకాలంలో అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో ఓవైపు ఎండ.. మరోవైపు భూములు పొడిబారి కూలీలకు పని చేయడం కష్టమవుతుంది. ఈ నేపథ్యంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఫిబ్రవరి నుంచి మే వరకూ ఉపాధిహామీ కూలీలకు వేసవి భృతి కింద అదనపు వేతనం చెల్లించేది. కూలీలు చేసిన పని మొత్తంపై ఫిబ్రవరిలో 15శాతం, మార్చి, ఏప్రిల్, మే నెలల్లో 30 శాతం చొప్పున అదనంగా ఇచ్చేది. కూలీలు తెచ్చుకునే పరికరాలకు కూడా అదనంగా సొమ్ము చెల్లించేది. గడ్డపారకు రూ.10, తట్టకు రూ.5, తాగునీటి కోసం రూ.5 వేసవి అలవెన్స్‌గా అందించేది. దీంతో కూలీలకు కొంతమేర లబ్ధి చేకూరేది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వేసవి భృతి నిలిపేసింది. ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్ అమలు చేస్తూ.. ఎంత పనిచేస్తే.. అంతే కూలీ అనే నినాదాన్ని అమలు చేస్తోంది. వేసవి భృతి నిలిపేయడంతో పనికి తగిన కూలీ గిట్టుబాటు కావడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనిచేసే సమయంలో టెంట్లు, తాగునీటి వసతి ఉండడం లేదని పేర్కొంటున్నారు. ఏ చిన్న గాయమైనా.. ప్రథమ చికిత్స కిట్లు కూడా అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. అధికారులు స్పందించి వేసవి భృతి అందించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. పనిచేసే ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


పనులు చేస్తున్న ఉపాధిహామీ కూలీలు

ముగ్గురు వైద్య సిబ్బందికి మెమోలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

శ్రీకాకుళం క్రైం, జూన్ 3: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు వైద్యసిబ్బందిపై జిల్లా వైద్యారోగ్య శాఖాధికారిణి బి.మీనాక్షి క్రమశిక్షణ చర్యలు చేపట్టారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయంలో భక్తులకు వైద్యసేవలందించేందుకుగానూ స్థానిక యూపీహెచ్‌సీలో పనిచేస్తున్న మెడికల్ అధికారిణి డా.సాయిదివ్య, ఏఎన్ఎమ్‌లు ఏ.ఆదిలక్ష్మి, ఎస్.పార్వతికి డ్యూటీ బాధ్యతలు వేశారు. కాగా.. ఆదివారం విధులు నిర్వహించే సమయంలో ఆ ముగ్గురూ ఆలయంలో లేరు. ఎండతీవ్రతకు కొంతమంది భక్తులు అస్వస్థతకు గురికాగా.. స్థానిక ఆర్ఎంపీతో వైద్యసేవలు అందించారు. వైద్యుల నిర్లక్ష్యంపై 'ఆదిత్యుడి సన్నిధిలో.. అవే కష్టాలు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం ప్రచురితమైన కథనంపై డీఎంహెచ్‌వో మీనాక్షి స్పందించారు. నిరక్ష్యంగా వ్యవహరించిన మెడికల్ అధికారిణితోపాటు ఇద్దరు ఏఎన్ఎమ్‌లకు మెమోలు జారీచేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.



క్లీంకారకు కల్కి టీమ్ గిఫ్ట్స్

విడుదల తేదీ దగ్గర పడడంతో 'కల్కి 2898 ఏ.డీ' చిత్ర బృందం ప్రచారం జోరు పెంచింది. ప్రమోషన్స్‌లో భాగంగా స్టార్ కిడ్స్‌కు గిఫ్ట్‌ను పంపిస్తోంది. ఇటీవలే ఈ గిఫ్ట్ రామ్‌చరణ్, ఉపాసనల కూతురు క్లీంకారకు చేరాయి. ఆ బహుమతుల్లో బుజ్జి-భైరవ స్టిక్కర్స్, బుజ్జి క్యారెక్టర్ బొమ్మ, టీషర్ట్‌లు ఉన్నాయి. ఆ గిఫ్ట్‌తో ఆడుకుంటున్న క్లీంకార ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఉపాసన.. కల్కి టీమ్‌కు కృతజ్ఞతలతో పాటూ ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఈ ప్రచారంలో భాగంగా త్వరలోనే మరింత మంది సెలబ్రిటీల పిల్లలకూ ఈ గిఫ్ట్ అందుతాయట. కాగా, అభిమానులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న పాన్ ఇండియా మూవీ 'కల్కి 2898 ఏ.డీ' ఈ నెల 27న విడుదల కానుంది. ప్రభాస్ హీరోగా నటించిన ఈ సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్‌కు నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొనే, దిశా పటానీలతో కూడిన భారీ తారాగణం ఇందులో నటించారు. వైజయంతీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అశ్వనీదత్ నిర్మించిన ఈ చిత్రం మహా భారతంతో మొదలై క్రీస్తు శకం 2898లో పూర్తయ్యేలా, మొత్తం ఆరు వేల ఏళ్ల సంవత్సరాల వ్యవధిలో జరిగే కథగా తెరకెక్కింది.

హిలేరియస్ ఎంటర్‌టైనర్



అదితి, జాన్సన్, హరినాథ్ పొలిచెర్లా, సుస్మితా ఛటర్జీ, సత్య ముఖ్య పాత్రలు పోషించిన ఈచిత్రం 'వాట్ ది ఫిష్'. వరుణ్ కోరుకొండ దర్శకత్వంలో విశాల్ బెజవాడ, విశాల్ బెజవాడ నిర్మించారు. 'ఇదొక యూనిక్ యాక్షన్ థ్రిల్లర్, హిలేరియస్ ఎంటర్‌టైనర్. ఇటీవల విడుదల చేసిన నిహారిక కొణిదెల, వెన్నెల కిశోర్ ఫస్ట్ లుక్ పోస్టర్స్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.' అని దర్శక నిర్మాతలు చెప్పారు. వివిధ భాషల్లో ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ చిత్రానికి శక్తికాంత్ కార్తీక్ సంగీతం అందిస్తున్నారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/CWjbW6W లో చదవండి.

అటు రజనీకాంత్.. ఇటు ఎన్టీఆర్





తమిళ చిత్రరంగ సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రస్తుతం హిమాలయ పర్యటనలో ఉన్న సంగతి తెలిసిందే. తన ఆధ్యాత్మిక యాత్రలో భాగంలో కేదార్‌నాథ్, బద్రీనాథ్ దేవాలయాలను సందర్శించిన రజనీకాంత్ ఇప్పుడు అక్కడున్న సాధువులను కలుసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఓ సాధువుతో ఆధ్యాత్మిక విషయాలు చర్చిస్తూనే తన సినిమాల ముచ్చట్లు కూడా వివరించారు. ప్రస్తుతం 'వెట్టియాన్'లో నటిస్తున్నాను. నా వర్క్ పూర్తయింది. మిగిలిన నటీనటుల మీద చిత్రీకరణ జరుగుతోంది. విజయదశమి సందర్భంగా అక్టోబరు పదిన ఆ సినిమా విడుదల చేయాలనుకుంటున్నారు. నా కొత్త సినిమా 'కూలీ' షూటింగ్ ఈ నెల పదిన ప్రారంభమవుతుంది. ఈ సినిమాలకు లోకేశ్ కనకరాజ్ దర్శకత్వం వహిస్తారు' అని ఆ సాధువుకు చెప్పారు రజనీకాంత్. జూనియర్ ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న 'దేవర పార్ట్ 1' చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. అదే రోజున రజనీకాంత్ సినిమా కూడా వస్తుండడంతో ఈ రెండు చిత్రాల మధ్య పోటీ తప్పదంటున్నారు సినీ పరిశీలకులు. అయితే రజనీకాంత్ చిత్రం విడుదల తేదీని ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. ఈ రెండు చిత్రాల మధ్య పోటీ ఉంటుందా లేదా అని తెలియాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే!

థ్రిల్లర్స్ ఇష్టపడే వారికి నచ్చేలా సత్యభామ



థ్రిల్లర్ చిత్రాల స్పెషలిస్ట్‌గా పేరు తెచ్చుకున్నారు సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకాల. సినిమాకు ఆయన ఇచ్చిన సంగీతం కంటే అందులోని నేపథ్య సంగీతంతోనే పాపులరైన శ్రీచరణ్.. తాజాగా మ్యూజిక్ అందించిన చిత్రం 'సత్యభామ'. కాజల్ అగర్వాల్ లీడ్ రోల్‌లో నటించగా.. నవీన్‌చంద్ర కీలక పాత్ర పోషించారు. ఈ క్రైమ్ థ్రిల్లర్ చిత్రానికి సుమన్ చిక్కాల దర్శకత్వం వహించారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ఆయన చిత్ర విశేషాలను మీడియాతో ముచ్చటించారు.

"నేను కేవలం థ్రిల్లర్ మూవీస్‌కే ఎక్కువ వర్క్ చేస్తానని అందరూ అభిప్రాయపడుతుంటారు. కానీ నాకు అన్ని రకాల సినిమాలకు సంగీతం అందించడం ఇష్టం. ఈ సినిమాలో మొత్తం ఐదు పాటలుంటాయి. అవి వేటికవే భిన్నంగా ఉంటూ.. అందరినీ ఆకట్టుకుంటాయి. థ్రిల్లర్ మూవీస్ ఇష్టపడే వారికి ఈ చిత్రం చాలా బాగా నచ్చుతుంది. ఇందులోని ట్విస్ట్‌లు అదిరిపోతాయి. ఒక పోలీసాఫీసర్ ఎమోషనల్ జర్నీ ఇది. కాజల్‌కు ఇది పర్ఫెక్ట్ కమ్‌బ్యాక్ సినిమా అవుతుంది. ఇందులోని యాక్షన్ ఎపిసోడ్స్ థియేటర్స్‌లో సినిమాను చూసే ప్రేక్షకులకు గూస్‌బంప్స్ తెప్పిస్తాయి. పోరాట ఘట్టాల్లో ఆమె డూప్ లేకుండా చేశారు. కాజల్ కెరీర్‌లోనే ఈ సినిమా బిగ్గెస్ట్ హిట్‌గా నిలుస్తుందనే నమ్మకం ఉంది. డైరెక్టర్ సుమన్ ఈ సినిమాను తన మేకింగ్‌తో మరో స్థాయికి తీసుకెళ్లారు" అని చెప్పారు.

యూత్‌ను ఆకట్టుకుంటుంది



యదార్థ సంఘటనల ఆధారంగా.. యూత్ ఆడియెన్స్‌కు మెప్పించేలా తెరకెక్కిన చిత్రం 'ప్రభుత్వ జూనియర్ కళాశాల పుంగనూరు-500143'. శ్రీనాథ్ పులకరం ఈ టీనేజ్ లవ్ డ్రామాకు దర్శకత్వం వహించగా, భువన్‌రెడ్డి కొవ్వూరి నిర్మించారు. ప్రణవ్ ప్రీతమ్, షాజ్ఞశ్రీ వేణున్, రామ్ పటాస్, తేజగౌడ్ ముఖ్య పాత్రల్లో నటించారు. ఈ నెల 21న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు శ్రీనాథ్ పులకరం మాట్లాడుతూ "ఇందులోని లవ్‌స్టోరీ ప్రేక్షకుల మనసుకు హత్తుకునేలా ఉంటుంది" అని చెప్పారు. నిర్మాత భువన్‌రెడ్డి కొవ్వూరి మాట్లాడుతూ "ఈ సినిమా యూత్‌ను విపరీతంగా ఆకట్టుకుంటుంది" అని అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్:కోదాటి పవన్‌కల్యాణ్, డీఓపీ: నిఖిల్ సురేంద్రన్, సంగీతం: కార్తీక్ రోడ్రిగజ్.

దిక్సూచి
DIKSUCHI



గ్లోబలైజేషన్ ప్రక్రియ ఊపందుకున్న తరవాత ముఖ్యంగా రెండు వేల సంవత్సరం నుంచి ఐటీ రంగం మూడు పూవులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. మధ్యలో రెండుసార్లు తలెత్తిన మాంద్యం ప్రభావం తీవ్రంగా ఉన్నప్పటికీ ఎక్కువ మందికి ఉపాధి కల్పించే రంగమే కాకుండా హై పెయిడ్‌గా ఉండడంతో సంబంధిత చదువులకు డిమాండ్ అధికంగా ఉంది. బీటెక్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ) కొంతకాలంగా ఎదురులేని కోర్సుగా మారింది. ఈ నేపథ్యంలో సదరు కోర్సుకు తోడు ఎప్పటికప్పుడు కొత్త పుంతలు తొక్కుతున్న ఐటీ రంగంపై ఎన్ఐటి రాయపూర్ డైరెక్టర్ ప్రొఫెసర్ **ఎన్.వి.రమణారావు** చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి.

కంప్యూటర్లు, అల్గోరిథమ్స్ నుంచి ప్రోగ్రామ్స్, సర్క్యూట్స్ అలాగే సాఫ్ట్ వేర్, హార్డ్‌వేర్‌కుతోడు అప్లికేషన్స్(అన్వయం) సహా యావత్తు అధ్యయనం కంప్యూటర్ సైన్స్‌లో ఉంటుంది. ప్రాథమికంగా కంప్యూటర్లు, సంబంధిత అప్లికేషన్స్ అధ్యయనమే కంప్యూటర్ సైన్స్. సాఫ్ట్‌వేర్, అప్లికేషన్స్ తోనే మొత్తం ప్రపంచాన్ని తెలుసుకునే స్వేచ్ఛను విద్యార్థికి అది కలుగజేస్తోంది. కంప్యూటర్ అల్గోరిథమ్స్, లాంగ్వేజ్‌లు సదరు మెషీన్లకు ప్రోగ్రామ్‌ను సమకూరుస్తాయి. డేటా స్ట్రక్చర్స్, నెట్‌వర్కింగ్ అదేవిధంగా కంప్యూటర్లలో నెట్‌వర్క్స్ అధ్యయనం కూడా ఉంటుంది. కేవలం సాఫ్ట్‌వేర్ లాంగ్వేజెస్ స్టడీకే పరిమితం కాదు. సదరు రంగాలు అంటే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ ఇంజనీరింగ్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్ తదితరాలూ ఉన్నాయి.

కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్: కంప్యూటర్స్‌కు సంబంధించి బేసిక్స్ నుంచి ఈ కోర్సులో నేర్చుకునే అవకాశం విద్యార్థులకు ఉంటుంది. సైన్స్ ఆఫ్ కంప్యూటర్స్ అంటే అందులోని ఆర్కిటెక్చర్ సహా కంప్యూటర్ సైన్స్, మెయిన్ ప్రోగ్రామ్ లాంగ్వేజెస్, కంప్యూటర్ సర్క్యూట్స్ పరిచయం, యావత్తు ప్రక్రియను రన్ చేసే అల్గోరిథమ్స్ ఈ కోర్సు అధ్యయనంలో భాగం. మేథమెటిక్స్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో ఈ సబ్జెక్టు మూలాలు ఉన్నాయి. దాంతో అటు సాఫ్ట్‌వేర్, ఇటు హార్డ్‌వేర్ తెలుసుకోవాల్సి ఉంటుంది.

కంప్యూటర్ ఇంజనీరింగ్: సీఎస్ఈ మాదిరిగానే ఉన్నప్పటికీ చిన్నపాటి తేడాతో ఈ కోర్సు ఉంటుంది. కొన్ని టాపిక్స్ విషయంలో ఈ రెంటి మధ్య తేడా కనిపిస్తుంది. హార్డ్‌వేర్ల డిజైనింగ్, అసెంబ్లింగ్‌కు తోడు మైక్రోప్రాసెసర్ల సర్క్యూట్ డిజైనింగ్, సూపర్ కంప్యూటర్స్ ఈ కోర్సులో ఉంటాయి. అంతిమంగా దేశాన్ని సాంకేతికంగా నడిపేందుకు అవసరమైన విద్య ఉంటుంది.

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ: కంప్యూటర్స్ డేటా మేనేజ్‌మెంట్‌కు తోడు నెట్‌వర్క్స్, నెట్‌వర్క్ మేనేజ్‌మెంట్ ఈ కోర్సులో ఉంటాయి. డేటా స్టోరేజీ, మానిప్యులేషన్ అధ్యయనంగా ఉంటుంది. డేటా అంటే ఇక్కడ మెషిన్లలో ఉన్నదని అర్థం.

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటి): మెషిన్ కోడ్స్, కంప్యూటర్ లేదంటే ఎలక్ట్రానిక్ డివైజ్‌ను డ్రైవ్ చేసే డేటా ఈ కోర్సులో చదవాలి. నెట్‌వర్కింగ్ స్టడీ అంటే ఒకే పని చేస్తున్న డివైజ్‌ల మధ్య నెట్‌వర్క్‌ను ఎస్టాబ్లిష్ చేయాలి. వాణిజ్యపరంగా బిజినెస్ ప్రపంచంలో ఇది కీలకం.

స్టూడెంట్స్ చాయిస్ సీఎస్ఈ

కెరీర్ అవకాశాలు



- ★ కంప్యూటర్ సైన్స్ లేదా ఐటీ లేదా సంబంధిత ఏరియాలో డిగ్రీ ఉన్న వ్యక్తులుగా సిస్టమ్ ప్రోగ్రామర్, సాఫ్ట్‌వేర్ డెవలపర్, వెబ్ డెవలపర్, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్, సాఫ్ట్‌వేర్ టెస్టర్, ప్రొడక్ట్ మేనేజర్, ఇంజనీరింగ్ మేనేజర్ వంటి ఉద్యోగాలు పొందవచ్చు. ఉదాహరణకు కంప్యూటర్ సైన్స్‌లో నిపుణుడు సీనియర్ ప్రోగ్రామర్, సిస్టమ్ అనలిస్ట్, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్, డేటాబేస్ మేనేజర్, సాఫ్ట్‌వేర్ డెవలపర్, ఫైనాన్షియల్ అనలిస్ట్‌గా చేరవచ్చు.
- ★ కంప్యూటర్ ప్రోగ్రామ్‌లో ఎక్స్‌పర్ట్ - కంప్యూటర్ ప్రోగ్రామర్, వెబ్ డెవలపర్/అడ్మినిస్ట్రేటర్, డేటా బేస్ అడ్మినిస్ట్రేటర్, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్, హెల్ప్‌డెస్క్ ఆపరేటర్, పీసీ సపోర్ట్ అడ్మినిస్ట్రేటర్, నెట్‌వర్క్ సపోర్ట్ అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేయవచ్చు.
- ★ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో నిపుణుడు ఐటీ ప్రాజెక్ట్ మేనేజర్, టెక్ సపోర్ట్ మేనేజర్, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్, వెబ్‌డెవలపర్, వెబ్‌సైట్ అడ్మినిస్ట్రేటర్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ అనలిస్ట్, డేటాబేస్ అడ్మినిస్ట్రేటర్, అప్లికేషన్ డెవలపర్, సాఫ్ట్‌వేర్ టెస్టర్‌గా పనిచేయవచ్చు.
- ★ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ నిపుణుడు సిస్టమ్ అనలిస్ట్, డేటాబేస్ అడ్మినిస్ట్రేటర్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ మేనేజర్, అప్లికేషన్ ప్రోగ్రామర్‌గా చేరవచ్చు.
- ★ కంప్యూటర్ ఫోరెన్సిక్ నిపుణుడు డిజిటల్ ఫోరెన్సిక్ అనలిస్ట్, ఎగ్జామినర్ అనలిస్ట్, కంప్యూటర్ ఫోరెన్సిక్స్ టెక్నాలజిస్ట్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్ సెక్యూరిటీ ఆఫీసర్, సిస్టమ్ అనలిస్ట్, సిస్టమ్ ఇంజనీర్, డేటాబేస్ అనలిస్ట్, కంప్యూటర్ ఫోరెన్సిక్ అసోసియేట్‌గా పనిచేయవచ్చు.
- ★ గేమ్స్ డిజైన్ ఎక్స్‌పర్ట్ గేమ్ డిజైనర్, గేమ్ ఆర్టిస్ట్, గేమ్ ప్రొడ్యూసర్, గేమ్ టెస్టర్, గేమ్ సౌండ్ ఇంజనీర్‌గా చేరవచ్చు.

కంప్యూటర్ సైన్స్ అనే కాదు, ఏ బ్రాంచ్ తీసుకున్న విద్యార్థికి అయినా తన సబ్జెక్టుపై లోతైన అవగాహన ఉండాలి. అప్పుడే జాబ్ మార్కెట్లో ఇతరులపై ఎడ్జ్ ఉంటుంది. అదే అనుకున్న లక్ష్యానికి చేరువ చేస్తుంది. అదేవిధంగా ఎంపిక చేసుకున్న రంగానికి సంబంధించి తదుపరి కోర్సులపై కూడా దృష్టిసారించాలి. ఎప్పటికప్పుడు టెక్నికల్‌గా అప్డేట్ అవుతూ ఉండాలి. తద్వారా మరింత పరిణతి సాధించాలి. అంటే ఈ రంగంలో నిలదొక్కుకోవాలంటే లైఫ్ లాంగ్ లెర్నింగ్(3ఎల్)కు అలవడాలి. మరోవైపు వాస్తవ పరిస్థితినీ గమనించాలి. పెద్ద ఎత్తున కోర్సులు అలాగే ఛాయిస్‌లు ఉన్న ఈ రోజుల్లో చదివిన కోర్సుకు తగ్గ ఉద్యోగం లభించడం, అందులో నిలదొక్కుకోవడం ఒక రకంగా కత్తిమీద సాము అనే చెప్పాలి. కంప్యూటర్ సైన్స్ విషయానికి వస్తే దాని పరిధి ఏటేటా విస్తృతమవుతోంది.

కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్(సీఎస్ఈ) లేదా డేటా సైన్స్, ఏఐ, మెషీన్ లెర్నింగ్ వంటి బ్రాంచీలను తీసుకునే ముందు విద్యార్థులు కొన్ని విషయాలను అర్థం చేసుకోవాలి. వాటిలో...

- మేథ్స్‌లో బలమైన పునాది ఉండాలి. కంప్యూటర్ సైన్స్‌కు సంబంధించి ఇది కీలకమైన సబ్జెక్టు. ఆల్జీబ్రా, కాలిక్యులస్, ప్రాబబిలిటీ, డిస్క్రీట్ మేథమెటిక్స్ చాలా ముఖ్యమైనవి.
- పైథాన్, జావా లేదా సి++ వంటి ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌లు తెలిసి ఉండాలి. వేరియబుల్స్, లూప్స్, ఫంక్షన్స్, డేటాస్ట్రక్చర్స్ వంటి బేసిక్ ప్రోగ్రామింగ్ కాన్సెప్ట్‌లు తెలిసి ఉండాలి.
- కంప్యూటర్ల పనితీరుపై ప్రాథమిక అవగాహన తప్పనిసరి. సీపీయూ, మెమరీ, స్టోరేజ్, ఆపరేటింగ్ సిస్టమ్స్ తెలియాలి.

3ఎల్ తప్పనిసరి

- బేసిక్ అల్గోరిథమ్స్, డేటా స్ట్రక్చర్స్ అంటే ఆరేస్, లింక్డ్ లిస్ట్స్, స్టేక్స్ క్యూస్, ట్రీస్, సార్టింగ్ అల్గోరిథమ్స్ వంటి కంప్యూటర్ సైన్స్ ఫండమెంటల్స్‌పై పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి.
- కంప్యూటర్ ఆర్కిటెక్చర్ బేసిక్స్ కూడా తెలియాలి. లాజిక్ గేట్స్, ప్రాసెసర్స్, మెమరీ హైరార్కీ, ఇన్‌పుట్/ఔట్‌పుట్ సిస్టమ్స్ వంటివి ఉపయోగకరం.
- సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ ప్రిన్సిపల్స్ కూడా తెలియాలి. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ప్రాసెసస్, డిజైన్ ప్యాటర్న్స్, టెస్టింగ్ మెథడాలజీస్, వెర్షన్ కంట్రోల్ సిస్టమ్స్‌పై అవగాహన పెంచుకోవాలి.
- నెట్‌వర్కింగ్ అండ్ సైబర్ సెక్యూరిటీపై ప్రాథమిక అవగాహన ఉండాలి. నెట్‌వర్క్స్, ప్రొటోకాల్స్ సైబర్ సెక్యూరిటీ కాన్సెప్ట్స్ వంటివి ఇవాల్టి సాంకేతిక ప్రపంచంలో చాలా ముఖ్యం.
- ప్రాబ్లెమ్ సాల్వింగ్ స్కిల్స్ ఉండాలి. కంప్యూటర్ సైన్స్‌లో తరచూ ఎదురయ్యే క్లిష్టమైన ప్రాబ్లెమ్స్‌ను సమర్థంగా పరిష్కరించగలగాలి. ప్రాబ్లమ్ సాల్వింగ్ నైపుణ్యాలను ఎంత బాగా నేర్చుకుంటే అంత మంచి కెరీర్ మున్ముందు ఉంటుంది.

గణాంకాలు

ఈ ఏడాది జనవరి చివరి నాటికి ఐటీ సెక్టార్‌లో ఓపెనింగ్స్ 50,000 ఉన్నాయి. మునుపటి సంవత్సరంతో పోల్చుకుంటే తగ్గుదల 21 శాతం. అంతకుముందు సంవత్సరం అంటే రెండేళ్ళ క్రితంతో బేరీజు వేసుకుంటే 60 శాతం తగ్గింది. లింక్డిన్, ఇతర జాబ్ బోర్డులను పరిగణనలోకి తీసుకుంటే ఈ లెక్క తేలుతోంది. డేటా శాంపిల్స్‌లో 80 శాతం ఒకే విషయాన్ని రూఢిపరుస్తున్నాయి. ఎంట్రీ లెవెల్‌లో స్లంప్ ఇంకా బాగా చెప్పాలంటే పిరమిడ్‌లోని అట్టడుగున రిక్రూట్‌మెంట్స్ దాదాపుగా స్తంభించాయని చెప్పవచ్చు. ఎనిమిది నుంచి తొమ్మిది శాతం మేర అట్రిషన్స్(ఒక కంపెనీని వదిలి ఇంకో చోటకు వెళ్ళడం) ఉంటోంది. అయినప్పటికీ కొత్తగా హైరింగ్ ఉండటం లేదు. ఇంకో మాటలో చెప్పుకొంటే హైరింగ్ విషయంలో రిక్రూటర్లు అప్రమత్తంగా ఉంటున్నారు. ఈ పరిణామాన్ని 'లో నుంచి నో హైరింగ్ యాక్షన్‌గా 'ఎక్స్‌ఫెనో' కోఫౌండర్ అభివర్ణించారు. ఈ తగ్గుదల రెండేళ్ళుగా కొనసాగుతోంది. అన్ని పరిశ్రమలను లెక్కలోకి తీసుకుంటే అందులో ఉండే వైట్-కాలర్ జాబ్స్ స్పేస్ 2,10,000. కాగా జనవరి 2022ని ప్రామాణికంగా తీసుకుంటే తగ్గుదల 35 శాతంగా నమోదైంది. ఐటి సర్వీసెస్ సెక్టార్‌లో ప్రస్తుతం సిస్టమేటిక్ కరెక్షన్ చోటుచేసుకుంటోందని 'లాంగ్‌హౌస్ కన్సల్టింగ్' సీఈఓ తెలిపారు. ఎంట్రీ లెవెల్ గ్రాడ్యుయేట్లతో ఇప్పుడు క్యాంపస్‌లు నిండి ఉన్నాయి. నిజానికి వీరు ఇప్పుడు ఒకటి, రెండేళ్ళ అనుభవం ఉండి ఉద్యోగం పోగొట్టుకున్న వాళ్ళతో పోటీపడాల్సి వస్తోందంటూ పరిస్థితిని వివరించారు. అంతర్జాతీయంగా ఆర్థిక వ్యవస్థ మందగించిందని, ఆ ప్రభావం ఇండియన్ టెక్నాలజీపై కూడా పడిందని డెలాయిట్ ఇండియా డైరెక్టర్ తెలిపారు. స్థూల ఆర్థిక వ్యవస్థలోని అనిశ్చిత వాతావరణం ఫలితంగా క్లయింట్స్ చాలా అప్రమత్తంగా ఉంటున్నారని, ఇది రిక్రూట్‌మెంట్స్‌పై ప్రభావం చూపుతోందన్నారు. రాబోయే రెండు క్వార్టర్లలోనూ ఇదే పరిస్థితి ఉంటుదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాంకేతికంగా మెరుగుదల ముఖ్యంగా ఏఐ కూడా నియామకాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని చెప్పారు. దరిమిలా మారుతున్న వాతావరణానికి తగ్గట్టు ఎదిగితేనే ఐటీలో కుదురుకోవచ్చని, ఇది ఎప్పటికైనా రెండు వైపులా పదును ఉన్న కత్తే అని కూడా హితవు చెబుతున్నారు.

సమగ్ర కథనం 'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Iz9IMQyలో చదవండి.

కౌంటింగ్ కేంద్రానికి పోస్టల్ బ్యాలెట్లు తరలింపు

● ఏర్పాట్లను పరిశీలించిన ఎన్నికల అధికారులు

పలాస, జూన్ 3: వివిధ నియోజకవర్గాలకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ల బాక్సులను ఆర్వోల పర్యవేక్షణలో చిలకపాలెంలోని ఓట్ల లెక్కింపు కేంద్రాలకు సోమవారం తరలించారు. పలాస, టెక్కలి, నరసన్నపేటల నుంచి బ్యాలెట్ బాక్సులను అత్యంత భద్రత నడుమ వివిధ పార్టీల నేతల సమక్షంలో స్ట్రాంగ్ రూంలను తెరిచి కౌంటింగ్ కేంద్రాలకు ప్రత్యేక వాహనాల్లో తరలించారు. పలాస నియోజకవర్గానికి సంబంధించి ఉపాధ్యాయులు, ఉద్యోగుల పోస్టల్ ఓట్లను కట్టుదిట్టమైన భద్రత మధ్య సోమవారం సాయంత్రం చిలకపాలెంలోని కౌంటింగ్ కేంద్రానికి తరలించారు. పోస్టల్ బ్యాలెట్లను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ మంగళవారం నిర్వహిస్తుండడంతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వాటిని ఆర్వో భరత్‌నాయక్ పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు మధ్య తరలించారు. 26 బాక్సుల్లో ఓట్లను తరలించినట్లు ఆర్వో తెలిపారు. వివిధ పార్టీల నాయకుల సమక్షంలో పోస్టల్ ఓటు బాక్స్‌లకు సీలు వేసి తరలించినట్లు ఆర్వో తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్లు ఎస్ఎస్‌వీఎస్ నాయుడు, ఎం.సురేష్, టీడీపీ నాయకుడు విఠల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి నుంచి..

టెక్కలి: టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి సోమవారం వరకు తపాలా శాఖ ద్వారా వచ్చిన పోస్టల్ బ్యాలెట్లను సాయంత్రం చిలకపాలెం శివానీ ఇంజనీరింగ్ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రానికి తరలించారు. ఆర్వో నూరుల్‌కమర్, సీఐ షైదయ్య, టీడీపీ నేతలు కింజరాపు హరివరప్రసాద్, బగాది శేషగిరి, లాయర్ అచ్చెన్నాయుడు, కాంగ్రెస్ పార్టీకి చెందిన టీటీజీ గుప్త, వైసీపీకి చెందిన కిల్లి అజయ్, బమ్మిడి తులసి, పినకాన వైకుంఠరావు, విశ్వనాథం తదితరులు సమక్షంలో కంటైనర్‌లో వీటిని పోలీస్ బందోబస్తు మధ్య కౌంటింగ్ కేంద్రాలకు తరలించారు.


పలాస: పోస్టల్ బ్యాలెట్ బాక్సులను తరలిస్తున్న సిబ్బంది


నరసన్నపేట: స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న ఆర్వో

నరసన్నపేట నుంచి..

నరసన్నపేట: నరసన్నపేట నియోజకవర్గానికి సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్ నుంచి సోమవారం చిలకపాలెం కౌటింగ్ కేంద్రాలకు పటిష్ట భద్రత నడుమ తరలించారు. పోస్టల్ బ్యాలెట్లు 2,974 మంది ఉద్యోగులు వినియోగించుకున్నారని ఆర్వో రామ్మోహనరావు తెలిపారు. రాజకీయ పార్టీ నాయకుల సమక్షంలో స్ట్రాంగ్‌రూంను తెరిచి బాక్సుల తరలింపు ప్రక్రియ చేపట్టారు. కార్యక్రమంలో ఏఆర్వో కనకారావు తదితరులు పాల్గొన్నారు.


టెక్కలి: పోస్టల్ బ్యాలెట్ బాక్సుల తరలింపును పరిశీలిస్తున్న ఆర్వో నూరుల్ కమర్, వివిధ పార్టీల నేతలు

పోలీస్ పికెట్‌ను పరిశీలించిన డీఎస్పీ

నందిగాం: సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా కణితివూరు, దేవ పురంలో ఏర్పాటుచేసిన పోలీస్ పికెట్లను టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి సోమవారం పరిశీ లించారు. శ్రీకాకుళం పార్లమెంటరీ వైసీపీ అభ్యర్థి పేరాడ తిలక్ ఇంటి వద్ద, దేవపురంలో ఎన్నికల సందర్భంగా చోటుచేసుకున్న గొడవల్లో భాగంగా అక్కడ పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. దీంతో ఆయా రెండు ప్రాంతాలను డీఎస్పీ పరిశీలించి ఎటువంటి తగాదాలకు ఆస్కారం లేకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ మహ్మద్ అమీర్ ఆలీకి సూచించారు.


నందిగాం: కణితివూరులో పోలీస్ పికెట్‌ను పరిశీలించి సూచనలిస్తున్న డీఎస్పీ బాలచంద్రారెడ్డి

నేడు ర్యాలీలపై నిషేధం: డీఎస్పీ

టెక్కలి: ఎన్నికల ఫలితాల అనంతరం మంగళవారం రాజకీయ పార్టీల విజయోత్సవ ర్యాలీలు, బాణాసంచా కాల్చడం నిషేధమని డీఎస్పీ డి.బాలచంద్రారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెక్కలి, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల్లో ఓ డీఎస్పీ, నలుగురు సీఐలు, పది మంది ఎస్ఐలు, 134 మంది సివిల్ ఫోర్స్, 72 మంది హోంగార్డులు, ఆర్మ్‌డ్ రిజర్వ్, ఎస్‌టీఎఫ్ తదితర సెంట్రల్ ఫోర్స్‌తో నిఘా ఉంటుందన్నారు. గుంపులు గుంపులుగా తిరగడం, అల్లర్లు సృష్టించడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టంచేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ చర్యలు

ఎల్.ఎన్.పేట: రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడను న్నందున గ్రామాల్లో పార్టీల నాయకులు ర్యాలీలు, ఊరేగింపులు చేపట్ట రాదని, నిబంధనలను అతిక్రమిస్తే వారిపై క్రిమినల్ చర్యలు నమోదు చేస్తామని సరుబుజ్జిలి ఎస్ఐ బి.నిహార్ స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికలకోడ్ అమలులో ఉన్నందున గ్రామీణ ప్రాం తాల్లో పోలీసు నిఘా ఉంటుందన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తరు వాత గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా నేతలు, కార్యకర్తలు, ప్రజలు సంయమనంతో వ్యవహరించాలన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా అల్లర్లకు పాల్పడితే చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు.

మందసలో 144 అమలు

మందస: ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు మంగళవారం ఓట్ల లెక్కింపు కారణంగా మందసలో 144 సెక్షన్ అమలులో ఉందని ఎస్ఐ బి.అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాల అనంతరం విజయోత్సవాలు, ర్యాలీలు, మందుగుండు సామగ్రి పేల్చడం వంటి వాటికి అనుమతులు లేవన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ల నియామకం

టెక్కలి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో అన్ని నియోజకవర్గాలకు స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్లను కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ వివరాల మేరకు.. ఇచ్ఛాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.విష్ణుమూర్తి, సోంపేట ఏవో ఆర్.అప్పారావు, పలాస నియోజకవర్గానికి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కమల్‌వికాస్, డివిజినల్ ఆకౌంట్ ఆఫీసర్ కె.రమేష్, టెక్కలి అసెంబ్లీకి డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ సిగిలపల్లి వినయ్‌కుమార్, పీఆర్ ఏఈ మహంత్ కృష్ణచంద్రలను నియమించారు. అలాగే పాతపట్నం అసెంబ్లీకి ఇరిగేషన్ ఏఈ బి.శివరామకృష్ణ ప్రసాద్, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ ఎస్.భాస్కరరావు, శ్రీకాకుళం అసెంబ్లీకి అసిస్టెంట్ రిజిస్ట్రార్ కె.దామోదర రావు, ఏఈ ఎస్.విజయభాస్కరరావు, ఆమదాలవలస అసెంబ్లీకి పీఆర్ ఏఈ వడ్డి సత్య నారాయణ, ఏపీఎస్ఐడీసీ ఏఈ ఎం.కామరాజు, ఎచ్చెర్ల అసెంబ్లీకి ఈవోపీఆర్డీ ఎస్. శ్రీనివాసులు, పీఆర్ ఏఈ ఎస్.వెంకటఅప్పలనాయుడు, నరసన్నపేట అసెంబ్లీకి ఆర్‌అండ్‌బీ ఏఈ లోవతల్లి నాయుడు, వంశధార ఏఈ సీహెచ్ భానులను నియమించారు. వీరు ఆయా రిటర్నింగ్ హెడ్ క్వార్టర్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంటారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి


రికార్డులను పరిశీలిస్తున్న జేడీ జయరాజ్

జలుమూరు: గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్థక శాఖ జేడీ డాక్టర్ వి.జయరాజు కోరారు. స్థానిక పశు వైద్య కేంద్రంలో వైద్య శిబిరాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జబ్బవాపు, చిటుక వ్యాధి నివారణ టీకాలపై రైతులకు అవగాహన కలిగించాలన్నారు. తొలకరి వర్షాలు పడుతున్నందున సాధారణంగా పశువుల్లో వచ్చే వ్యాధుల నివారణకు టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. టెక్కలి డివిజన్‌లో జబ్బవాపు వ్యాధి నివారణకు 53,520 డోసులకు గాను ఇప్పటి వరకు 48,976 డోసులు వాక్సిన్ వేసినట్లు పేర్కొన్నారు. శ్రీకాకుళం డివిజన్‌లో 19,980 డోసుల లక్ష్యాన్ని మించి వ్యాక్సిన్ వేశామన్నారు. కార్యక్రమంలో కోటబొమ్మాళి ఏడీ మంద లోకనాథం, జలుమూరు పశువైద్యాధికారి ముద్దాడ దీప్తి తదితరులు పాల్గొన్నారు.

స్టార్టప్‌లపై ఐతమ్ అధ్యాపకులకు శిక్షణ


మాట్లాడుతున్న మెంటార్ మనోజ్‌కుమార్

టెక్కలి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్న స్టార్టప్‌లపై విద్యార్థులు దృష్టి పెట్టేలా ప్రతి అధ్యాపకుడు కృషి చేయాలని హైదరాబాద్‌కు చెందిన టెక్నాలజీ డెవలపర్స్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ మెంటార్ మనోజ్‌కుమార్ అన్నారు. సోమవారం ఐతమ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఐటీ విభాగం ఆధ్వర్యంలో 'డిజైన్ థింకింగ్ అండ్ ఎంటర్ పెన్యూర్ షిప్' పై ఐదు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్టార్టప్‌లకు కావాల్సిన అనేక మంచి ఆలోచనలు విద్యా ర్థులు అభివృద్ధి చేసుకునేలా శిక్షణ ఇస్తామన్నారు. డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సర్టిఫికెట్ కోసం కాకుండా విషయంపై పూర్తి అవగాహన చేసుకునేలా శిక్షణ పొందాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సి పాల్ డాక్టర్ శ్రీనివాసరావు, ఐటీ ఇన్‌చార్జి డాక్టర్ సతీష్ కుమార్, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు అందించాలి

నరసన్నపేట: పచ్చిరొట్ట విత్తనాల ధరలను ప్రభుత్వం భారీగా పెంచడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని పలువురు రైతులు వాపోతున్నారు. భూసారం పెంచేందుకు దోహద పడే పచ్చిరొట్ట విత్తనాల ధరలను పెంచడం ఏమిటని వారు ప్రశ్నించారు. రైతు పక్షపాతి ప్రభుత్వమని గొప్పలు చెప్పుకునే పాలకులు, విత్తు నుంచి ఎరువుల వరకు ధరలు పెంచి తమను ఇబ్బందుకు గురి చేస్తోందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో 75 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు అందించగా ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం ఆ రాయితీని 50 శాతానికి తగ్గించిందని, దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు రైతులు అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి 75 శాతం రాయితీపై విత్తనాలు అందజేయాలని వారు కోరుతున్నారు.

ఇళ్లు కోల్పోయిన కుటుంబాలకు సాయం

మెళియాపుట్టి: మండలంలోని నందవ గ్రామంలో ఇటీవల వీచిన ఈదురుగాలులకు ఇంటి పైకప్పులు ఎగిరిపోయిన గిరిజన కుటుంబాలకు జనసేన నాయకులు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి నగదుతో పాటు నిత్యావసర వస్తువులను అందించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు దుక్క బాలరాజు, సవలాపురం చంటి, జిల్లా జనసేన కార్యవర్గ సభ్యులు సవర రామ్మూర్తి, లక్ష్మీపురం కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి..

పలాసరూరల్: బొడ్డపాడు గ్రామానికి చెందిన మద్దిల జోగారావుకు రెండు కిడ్నీలు పాడై ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబానికి సహచరులు సాయం అందించారు. 2003లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు మృతుడి భార్య గీతకు రూ.10 వేల సాయం అందించారు. పూర్వవిద్యార్థులు మద్దిల లింగరాజు, వంకల పాపారావు, జోగారావు పాల్గొన్నారు.

ఈదురుగాలులకు కూలిన భారీ వృక్షాలు

● ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

● ఇబ్బందులు పడిన ప్రజలు

● విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఉక్కపోత

పాతపట్నం: పాతపట్నం పరిసర గ్రామాల్లో ఆదివారం రాత్రి వీచిన ఈదురుగాలులు, భారీ వర్షానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భారీగా వీచిన ఈదురుగాలులకు అనేక చోట్ల భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో ప్రజలంతా రాత్రంతా ఉక్కపోతకు గురై తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానిక మహేంద్ర డిగ్రీ కళాశాల సమీపంలో ఆలాంధ్ర రోడ్డుపై భారీ వృక్షం కూలడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. వివిధ శాఖల అధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నం కావడంతో చెట్ల తొలగింపు ప్రక్రియలో తీవ్ర జాప్యం జరిగింది. దీంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగి వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. సోమవారం విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ పనుల్లో సిబ్బంది నిమగ్న మయ్యారు.


పాతపట్నం ఆలాంధ్రరోడ్‌పై అడ్డంగా కూలిన భారీ వృక్షం


విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ చేపడుతున్న సిబ్బంది

పిడుగు పడి మేకపోతు మృత్యువాత

జలుమూరు: వెంకటాపురం పంచాయతీ వెలమలవానిపేటలో ఆదివారం రాత్రి పిడు గు పడి మందలో ఉన్న మేకపోతు మృత్యువాత పడింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. సారవకోట మండలం వడ్డినవలసకి చెందిన బంటుపల్లి రామారావు వెలమలవానిపేటలోని వెలమల రాము పొలంలో గొర్రెలు మంద వేశాడు. ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులతో పాటు పిడుగు పడి పొట్టేలు మృతి చెందింది. దీంతో యజమాని లబోదిబోమంటున్నాడు. పిడుగు పడిన సమయంలో మిగిలిన గొర్రెలు దూరంగా ఉండడంతో బతికి బయటపడ్డాయి.

తొలకరితో పులకరించిన పుడమి

జలుమూరు: తొలకరి వర్షంతో పుడమి పులకరించింది. మండలంలో ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసి పొలాల్లోకి చేరడంతో రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభంలో భారీ వర్షం పడడంతో వేసవి దుక్కిలు చేసుకోవచ్చని, దుక్కులకు ఈ వర్షం ఎంతో మేలు చేకూరుస్తుందన్నారు. ఇదిలా ఉండగా ఈదురు గాలులతో మామిడి రైతులకు తీరని నష్టం వాటిల్లింది. జలుమూరు, శ్రీముఖలింగం, నగిరికటకం, మర్రివలస, కొమనాపల్లి, సురవరం, తిమడాం, పర్లాం, మాకివలస అందవరం, తదితర ప్రాంతాల్లోని మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు.


జలుమూరు పొలాల్లో చేరిన వర్షం నీరు

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు

మెళియాపుట్టి: గ్రంథాలయాలు విద్యార్థులు, నిరుద్యోగులకు వరం లాంటివని గ్రంథాలయాధికారి అనూరాధ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా సోమవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో కాలాన్ని వృథా చేసుకోకుండా విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచి వాటిని చదివించడం జరుగుతోందన్నారు. పిల్లలకు విజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఈ శిక్షణలు దోహద పడతాయన్నారు. కార్యక్రమంలో మురళి, మణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపయోగం

నరసన్నపేట: వేసవిలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని ఎంఈవో ఉప్పాడ శాంతారావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న విజ్ఞాన శిబిరాన్ని సోమవారం పరిశీలించారు. పుస్తక పఠనం అలవర్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి చాయారతన్ తదితరులు పాల్గొన్నారు.

మేథో పటిమకు పదును

పాతపట్నం: విద్యార్థుల మేథో పటిమకు పదును పెట్టేందుకు చదరంగం దోహదం చేస్తుందని శాఖా గ్రంథాలయాధికారి కాళ్ల రాజు అన్నారు. వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా సోమవారం చదరంగం, పుస్తక పఠనం పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రిసోర్స్ పర్సన్లుగా వి.ఆనందరావు, బిబెనర్జీ వ్యవహరించారు. కార్యక్రమంలో పలువురు పాఠకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

నందిగాం: నందిగాం శాఖాగ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గ్రంథాలయాధికారి ఎస్.ఉదయ్‌కిరణ్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.


పాతపట్నం: చదరంగ పోటీలో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులు


క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

జీడికి మద్దతు ధర ప్రకటించే వరకు పోరాటం


రైతులతో సమావేశమైన జీడి రైతు సంఘం నేతలు

వజ్రపుకొత్తూరు: జీడి పిక్కలకు మద్దతు ధర ప్రకటించేవరకు శాంతియుతంగా పోరాటం కొనసాగిస్తామని జీడి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తెప్పల అజయ్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని వివిధ గ్రామాల్లో జీడి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.గడివూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 80 కిలోల జీడి పిక్కల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధరను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. నూతనంగా ఏర్పడే ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. పంట దిగుబడి తగ్గడంతో పాటు జీడి పంటకు పెట్టుబడులు పెరగడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, వారిని ఆదుకోవాలని కోరారు. కార్యక్ర మంలో సంఘం నాయకులు కె.గురయ్య, కె.మోహనరావు, ఎస్.గణపతి, కె.వినోద్, కె.తవి టయ్య, ఎస్.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

శివసాగర్ బీచ్‌లో 'మీరజ్' సినిమా సందడి

వజ్రపుకొత్తూరు: శివసాగర్ తీరంలో జీడి, కొబ్బరి తోటల్లో మీరజ్ సినిమా షూటింగ్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ విష్ణుదేవ్ మాట్లాడుతూ.. తెలుగు, ఒడియా భాషల్లో సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఈ సినిమా నిర్మాణం చేపడుతున్నామన్నారు. కేఎంసీ ఫిల్మ్ మేకర్స్ బ్యానర్‌లో మీరజ్ పేరుతో సినిమా నిర్మిస్తున్నట్లు నిర్మాత కె.సత్యభాస్కర్ తెలి పారు. శివసాగర్‌తో ఉన్న నీలకంఠే శ్వర ఆలయం సన్నిధిలోని విఘ్నేశ్వర స్వామి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. శ్రీకాకుళం జిల్లా ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కుమార్ నాయక్ క్లాప్ కొట్టి ప్రారంభించారు. కళాకారులు నారా ప్రసాద్, బాబూరావు, మూల తాతయ్య, కాళిదాసు, తంగి శోభ తదితరులు ఉన్నారు.

పైపులైన్ లేక.. తాగునీరందక

● జలుమూరు నలనాగుల వీధి, బీసీ కాలనీల్లో తాగునీటి అవస్థలు

● కొన్ని వీధుల్లోనే తాగునీటి సదుపాయం ఏర్పాటు

● నిధులు లేవంటూ మిగిలిన పనులు వదిలేసిన అధికారులు

జలుమూరు: జలుమూరు నలనాగుల వీధిలో తాగునీటి కోసం స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. అచ్యుతాపురం రక్షిత నీటి పథకం నుంచి జలుమూరుకు నీరు సరఫరా అవుతోంది. అయితే నలనాగుల వీధికి పైపులైన్ ఏర్పాటు చేయలేదు. దీంతో తాగునీటి కోసం మహిళలు వీధి శివారులోని బావి వద్దకు వెళ్లాల్సి వస్తోంది. జలుమూరులోని అన్ని వీధులకు పైపులైన్లు వేసిన అధికారులు నలనాగుల వీధి, బీసీ కాలనీకి పైపులైన్లు వేయకపోవడం ఏమిటని మహిళలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగుచర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చైతన్య వద్ద ప్రస్తావించగా జలుమూరులోని అన్ని వీధులకు పైపులైన్లు వేసేందుకు నిధులు చాలలేదని, దీంతో కొన్ని ప్రాంతాల్లోనే వేశామన్నారు. నలనాగుల వీధికి, బీసీ కాలనీకి పైపులైన్ వేసేందుకు రూ.16 లక్షలు నిధులు మంజూరయ్యాయన్నారు. ఎన్నికల కోడ్ వచ్చినందున పనులు చేపట్ట లేదని, కోడ్ ముగిసిన వెంటనే పనులు ప్రారంభించి నీటి సదుపాయం కల్పిస్తామని పేర్కొన్నారు.


జలుమూరులో తాగునీటికి నోచుకోని నలనాగుల వీధి


గ్రామ శివారులో ఉన్న ఈ బావి నుంచే తాగునీటినే వీధి వాసులు తీసుకువెళ్లేది..

అపార్ట్‌మెంట్‌లో వ్యక్తి మృతి

- రెండు రోజుల కిందట ఘటన
- దుర్వాసనతో బయటపడిన వైనం


రమేష్ (ఫైల్)

శ్రీకాకుళం క్రైం: తన అపార్‌మెంట్‌లోనే ఓ వ్యక్తి రెండు రోజులు కిందట మృతి చెందగా, మృతదేహం నుంచి దుర్వాసన వెదజల్లడంతో విషయం బయటపడిన ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. టూటౌన్ పోలీసులు సోమవారం తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని నెహ్రూ వీధిలో ఉన్న బాలాజీ రెసిడెన్సీలోని 101వ ఫ్లాట్‌లో స్వర్ణకారుడు గంధం రమేష్(48) నివాసం ఉంటున్నాడు. ఇతనికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య అశ్వని 14 నెలల కిందట ఇంటి నుంచి పరారైంది. దీనిపై రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో రమేష్ ఫిర్యాదు చేశాడు. భార్య పారిపోవడంతో ఇద్దరు ఆడ పిల్లలు, ఒక మగ బిడ్డను ఒడిశా జిల్లా గారబంద గ్రామంలో ఉన్న అమ్మమ్మ సుగుణ సంరక్షణలో వారి ఉంచాడు. బుధవారం తన బిడ్డ ఫంక్షన్ నిమిత్తం గారబంద వెళ్లి శనివారం శ్రీకాకుళం వచ్చేశాడు. అదే రోజు రాత్రి మత్తుగా తాగి ఇంట్లో పడుకున్నాడు. అయితే సోమవారం ఉదయం ఆ ఇంటి నుంచి దుర్వాసన రావడంతో అదే అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న దేవరాపల్లి శ్రీనివాసరావు దీనిని గుర్తించి తలుపులు కొట్టినా రమేష్ నుంచి ఎటువంటి సమాధానం రాలేదు. దీంతో నగరంలోని మొండేటి వీధిలో ఉన్న అతడి సోదరి రాజమహేంద్రం చిన్నారికి సమాచారం ఇచ్చారు. ఆమె వెళ్లి తులుపులు బద్దలు కొట్టించి చూడగా.. గదిలో తువ్వాలు కట్టుకుని రమేష్ చనిపోయి ఉన్నాడు. దీంతో టూ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ హరికృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. భార్య వెళ్లిపోయిన నాటి నుంచి మద్యానికి బానిసైన రమేష్ అదే మత్తులో చనిపోయి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ దుర్మరణం

- మృతుడిది విజయనగరం జిల్లా గరివిడి మండలం

లావేరు: విజయనగరం జిల్లా గరివిడి మండలం శివరాం పంచాయతీ మాజీ సర్పంచ్ గవిడి కృష్ణారావు (62) ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కృష్ణారావు తన గ్రామం నుంచి ఆదివారం రాత్రి ద్విచక్రవాహనంపై లావేరు మండలం మురపాకలోని తమ బంధువుల ఇంటికి వెళ్లేందుకు బయలుదేరాడు. ఈ క్రమంలో జాతీయ రహదారి సుభద్రాపురం జంక్షన్‌కు సమీపానికి వచ్చేసరికి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందారు. లావేరు హెచ్‌సీ రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెల్లం ఊట ధ్వంసం

హరిపురం: మందస మండలం బాలిగాం గ్రామంలో సోమవారం నిర్వహించిన దాడుల్లో 1800 లీటర్ల బెల్లం ఊటలు, 40 లీటర్ల సారా ధ్వంసం చేసినట్లు ఎస్‌ఈబీ సీఐ జైభీం తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో వైన్ షాపులకు సెలవు ప్రకటించడంతో సారాపై వ్యాపారులు సారించారని, తమకు వచ్చిన పక్కా సమాచారంతో దాడులు నిర్వహించామన్నారు. అయితే తయారీదారులు పరారవడంతో ముడి సరుకులను ధ్వంసం చేశామన్నారు. దాడుల్లో సోంపేట, పలాస ఎక్సైజ్ అధికారులతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

కందిరీగల దాడి.. పది మందికి గాయాలు


చికిత్స పొందుతున్న బాధితులు

సోంపేట: మండలంలోని మామిడిపల్లిలో ఉపాధి కూలీలపై కందిరీగలు దాడి చేయడంతో పదిమంది గాయ పడ్డారు. ఎప్పటిలాగా సోమవారం ఉపాధి పనులు చేస్తుండా కందిరీగలు దాడిచేశాయి. దీంతో గాయపడిన బాధితులను హరిపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన కోరుబిల్లి దశమయ్య (65)ను శ్రీకాకుళం తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను సీపీఎం నాయకులు జుత్తు సింహాచలం, గొరకల మన్మధరావు, సర్పంచ్ పాతిన శేషగిరి, ఎంపీటీసీ దున్న మాధవరావు పరామర్శించారు.

విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు


ట్రాన్స్‌ఫార్మర్‌ను సరిచేయిస్తున్న ఇంజనీర్ల బృందం

గార: మండలంలో ఆదివారం రాత్రి ఉరుములు, మె రుపుల కారణం గా తూలుగు విద్యుత్ సబ్ స్టేషన్‌లో సాం కేతిక సమస్య ఏర్పడింది. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఏఈ పవనమూ ర్తి వారి సిబ్బంది ఆ పక్కనే ఉన్న రెండో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా వేకువ జాము న మూడు గంటలు సమయంలో విద్యుత్ సరఫరా జరిగేలా ప్రత్యామ్నాయ ఏర్పా ట్లు చేశారు. సమాచారం తెలిసిన వెంటనే టీఆర్‌ఈ టీమ్‌తో ఏడీఏలు బగ్గు రాం బాబు, వెంకటేశ్వరరావు, ఏఈ పవనమూర్తి తదితరులు తూలుగు చేరుకొని సాంకే తిక సమస్య ఏర్పడిన పవర్ ట్రాన్సాఫార్మర్‌ను సరిచేయించి సోమవారం మధ్యా హ్నానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చేశారు.

తోటవీధిలో అన్నసమారాధన

గుజరాతీపేట: స్థానిక గుజరాతీపేటలో గల తోట వీధిలో హనుమాన్ జయంతి సందర్భంగా సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. హయాతీనగరం, పాజిల్‌బాగ్‌పేట, గుజరాతీపేట, పీఎన్ కాలనీ తదితర ప్రాంతాల నుంచి సుమారు రెండు వేల మంది భక్తులు పాల్గొన్ని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు షన్ముఖ, చిన్న రాము, గణేష్, సూర రమణ, వినాయక, శనగల ఆనంద్, వెంకటరావు, స్థానికుల సహకారంతో కార్య క్రమం విజయవంతంగా చేపట్టారు.


అన్నదానంలో పాల్గొన్న భక్తులు

వామ్మో.. ఇవేం రోడ్లు

లావేరు: మండలం బొంతుపేట నుంచి మెట్టవలస వెళ్లే బీటీ రహదారి భారీ గుంతలతో ప్రమాదకరంగా మారింది. చిన్నపాటి వర్షం కురిసినా గుంతల్లో నీరు చేరుతోంది. అటు వైపుగా వచ్చే ప్రయాణికులు ఈ గుం తల్లో పడి తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి సమయంలో బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సి వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో మెట్టవలస, బుడతవలస, గుమడాం, వాళ్లెపేట, సూర్యనారాణపురం, నీలాపురంతో పాటు మరో పది గ్రామాల ప్రజలకు ఇదే ప్రధాన రహదారి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ రహదారికి మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


ప్రమాదకరంగా మారిన మెట్టవలస రహదారి

వర్షం కురిస్తే నరకమే..

ఎల్ఎన్ పేట: లక్ష్మీనర్సుపేట జంక్షన్ నుంచి ఫాక్స్‌దొరపేట మీదుగా బొత్తాడసింగి గ్రామానికి వెళ్లే రోడ్డుపై రాకపోకలు సాగించాలంటే నరక యాతన పడాల్సివస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ మాత్రం వర్షం పడినా రోడ్డుపై ఉన్న గుంతల్లో నీరు చేరి రోజుల తరబడి ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. గోతుల్లో వాహనాలు దిగబడి పాడవుతున్నాయని, వాహనదారులు గాయాల బారినపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బొత్తాడసింగి, జాడుపేట, సరడాం, ఫాక్స్‌దొరపేట గ్రామాలతోపాటు కొండ శివారులోని పలు గిరిజన గ్రామాల ప్రజలు ఈ మార్గం గుండానే రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


గుంతల్లో నీరు చేరి ఉన్న బొత్తాడసింగి రోడ్డు

చినుకుపడితే చిత్తడే

వజ్రపుకొత్తూరు: బాతుపురం నుంచి రాజాం గ్రామం వరకు ఉన్న గ్రావెల్ రోడ్డు చిన్నపాటి వర్షానికి చిత్తడిగా మారు తోంది. దీంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో రాజాం కాలనీ నుంచి రాజాం వరకు తారురోడ్డు నిర్మాణం చేపట్టారు. రాజాం నుంచి బాతుపురం రోడ్డును కూడా కొంతభాగం తారు రోడ్డు నిర్మించా రు. మిగిలిన సుమారు కిలోమీటరు గ్రావెల్ రోడ్డు వేసేందుకు వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదనలు చేసినా ఫలితం కనిపిం చలేదు. ఈ రోడ్డుపై నుంచి 10 గ్రామాల ప్రజలు రాకపో కలు సాగిస్తుంటారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మా ణానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


చిత్తడిగా మారిన బాతుపురం-రాజాం రోడ్డు

రోడ్లపైనే నీరు

గార: మండలంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి చాలా గ్రామాల్లో వర్షం నీరు రోడ్లపై నిలిచిపోయింది. ముఖ్యంగా నిత్యం రద్దీగా ఉండే గార, చింతాడ రోడ్డులో ఉన్న బూరవెల్లి, పూసర్లపాడు గ్రామాల్లో వద్ద నీరు నిలిచిపోవడంతో ఆయా గ్రామస్థులతోపాటు వాహనచోదకులు ఇబ్బందిపడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


పూసర్లపాడులో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

కౌంటింగ్ ఏజెంట్ల పాత్రే కీలకం

- ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు


మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు


శిక్షణలో పాల్గొన్న టీడీపీ కౌంటింగ్ ఏజెంట్లు

అరసవల్లి: ఈ నెల 4న జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియలో కౌంటింగ్ ఏజెంట్ల పాత్ర చాలా కీలకమని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. శ్రీకాకుళం పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ ఏజెంట్లకు శిక్షణ కార్యక్రమం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు ఆధ్వర్యంలో జరిగింది. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్‌తో కలిసి హాజరైన ఎంపీ మాట్లాడారు. 17-సీ ఫారం ప్రకారం క్షుణ్ణంగా పరిశీలన చేయాలని, అదే విధంగా పోస్టల్ బ్యాలెట్, ఈటీపీబీ ఓట్లు కౌంటింగ్ విషయంలో ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని పీఎంజే బాబు, కొమనాపల్లి వెంకటరామరాజు నిర్వహించారు. కార్యక్రమంలో నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, అరవల రవీంద్ర, కొర్ను నాగార్జున ప్రతాప్, చిట్టి మోహన్, గుత్తు చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపుపై పూర్తిస్థాయిలో శిక్షణ


శిక్షణలో మాట్లాడుతున్న జేసీ నవీన్

కలెక్టరేట్: సార్వత్రిక ఎన్నికల్లో ఓట్ల లెక్కింపు సిబ్బందికి సంపూర్ణ శిక్షణ ఇచ్చామని, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ వంటి కీలక అంశాలపై స్పష్టమైన సూచనలు జారీ చేశామని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ తెలిపారు. సోమవారం ఉదయం జిల్లాలో గల అన్ని నియోజకవర్గాలకు సంబంధించిన మైక్రో అబ్జర్వర్లకు, కౌంటింగ్ సిబ్బందికి శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాలలో ఓట్ల లెక్కింపుపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓట్ల లెక్కింపునకు సంబంధించి పలు సందేహాలకు జేసీ సమాధానాలు తెలియజేశారు.

రిమ్స్ ప్రాంగణంలో ఏఆర్‌టీ హెల్ప్ డెస్క్


మాట్లాడుతున్న నోడల్ అధికారి నరసింహారావు

అరసవల్లి: హెచ్ఐవీ వ్యాధిగ్రస్థుల జీవిత భాగస్వాములు, వారి పిల్లలకు పరీక్షలను ఏఆర్‌టీ కేంద్రంలోనే నిర్వహించనున్నట్టు, దీనికి సంబంధించి ఆసుపత్రి ప్రాంగణంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్టు ఆర్ట్ నోడల్ అధికారి డాక్టర్ నరసింహారావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ.. మందులు వాడుతున్న వారితో పాటు జీవిత భాగస్వామి, పిల్లల ఆరోగ్య పరిస్థితి కూడా ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. ఇందుకోసం నియంత్రణ సంస్థ ఉద్యోగులు నిరంతరం పర్యవేక్షిస్తూ ముందుకు సాగాలని, తద్వారా వ్యాధిని నియంత్రించవచ్చునన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అప్పలనాయుడు, డాక్టర్ చైతన్య, డీపీఎం కె.ఉమామహేశ్వరరావు, జె.సంతోష్‌కుమార్, ఎం.తారకేశ్వరరావు, పి.ఉష, హెచ్.నాగభూషణం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సిబ్బంది హాజరయ్యారు.

ప్రపంచ స్థాయి పారా వాలీబాల్ పోటీల్లో కొవ్వాడ యువకుడి ప్రతిభ

రణస్థలం: కొవ్వాడ గ్రామానికి చెందిన మైలపల్లి వెంకటరమణ ప్రపంచ స్థాయిలో చైనా దేశంలో జరిగిన పారా వాలీబాల్ పోటీలలో ద్వితియ స్థానం సాధించాడు. గత నెల 28వ తేదీ నుంచి చైనా దేశంలో పారా వాలీబాల్ పోటీలు జరుగుతున్నాయి. ఈ పోటీల్లో పాల్గొన్న వెంకటరమణ జట్టు ద్వితీయ స్థానం సాధించింది. నిరుపేద కుటుంబానికి చెందిన వెంకటరమణ చిన్ననాటి నుంచి క్రీడలపై ఆసక్తి ఉంది. ఇటీవల చెన్నైలో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిశాడు. ప్రపంచ స్థాయిలో వెంకటరమణ పారా వాలీబాల్ పోటీల్లో సత్తాచాటడంపై కొవ్వాడ గ్రామానికి చెందిన ప్రజలు అభినందిస్తున్నారు.


ట్రోఫీ అందుకుంటున్న జట్టుతో వెంకటరమణ

ఆకట్టుకున్న సైకత శిల్పం



ఆముదాలవలస: సంగమేశ్వర కొండ సమీపంలో గల గాజులకొల్లివలస గ్రామానికి చెందిన సైకత శిల్పి గేదెల హరికృష్ణ 'ఎవరిదీ సింహాసనం' శీర్షికతో వేసిన సైకత శిల్పం ఆకట్టుకుంటోంది. సార్వత్రిక ఎన్నికల ఓట్లు లెక్కింపు మంగళవారం జరగనుంది. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీ, ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, సీఎం జగన్, మాజీ సీఎం నారా చంద్రబాబు రూపాల మధ్యలో సింహాసనం అంటూ వేసిన సైకత కుర్చీ చూపరులకు ఆసక్తి కలిగించింది.

యథేచ్ఛగా కలప అక్రమ రవాణా

- ప్రభుత్వ ఆదాయానికి గండి
- పట్టించుకునే నాథుడు కరువు


ఏబీ రహదారిలో రాత్రిపూట కలప అక్రమ రవాణా

సరుబుజ్జిలి: అలికాం-బత్తిలి, పాలకొండ, కొమ్మనాపల్లి ప్రధాన రహదారుల్లో నిత్యమూ రాత్రివేళల్లో కలప అక్రమ రవాణా జరుగుతున్నా అరికట్టే నాథుడు కరువయ్యాడు. దీంతో ఈ వ్యాపారం అక్రమార్కులకు మూడు పువ్వులు ఆరు కాయలుగా మారింది. ముఖ్యంగా పర్లాకిమిడి, హడ్డుబంగి, గుణుపూర్, గుమ్మలక్ష్మీపురం తదితర ప్రాంతాల నుంచి నియోజకవర్గంలోని పలు షామిల్లులకు టేకు కలప రాత్రిపూట యథేచ్ఛగా తరలిస్తున్నారు. శ్రీకాకుళం అటవీశాఖ రేంజ్ పరిధి సరుబుజ్జిలి సెక్షన్ అయినప్పటికీ ప్రస్తుతం మన్యం జిల్లాలో ఉన్న సోమిదాలవలస, బొడ్డపాడు, జంబాడ, కడగండి అటవీ ప్రాంతాల్లో రిజర్వ్ అటవీ ప్రాంతంగా గుర్తించి దీనిపై అటవీశాఖ, సంబంధిత శాఖాధికారులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. ఈ ప్రాంతంలో పర్యటించాల్సిన మన్యం జిల్లా అటవీశాఖాధికారుల జాడ కనిపించకపోవడంతో కలప అక్రమ రవాణా చేస్తే వ్యక్తులకు మరింత అవకాశం కల్పించినట్టు కనిపిస్తుంది. దీంతో అటవీశాఖ ప్రత్యేక నిఘా లేకపోవడం వల్ల పగలు కూడా టేకు కలప రవాణా చేసే వాహనాలపై పరదాలు కప్పి ఏంచక్కా సొమ్ము చేసుకుంటున్నారు. రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో కూడా అనునిత్యమూ కొంతమంది అక్రమార్కులు తమకు కావాల్సిన అటవీకలపను నరుక్కుంటూ తీసుకెళ్లడం నిత్యకృత్యంగా మారింది. ఇప్పటికైనా జిల్లా అటవీశాఖాధికారులు ఈ ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అటవీ ప్రాంతాలను కాపాడడంతో పాటు కలప వ్యాపారం నుంచి ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

10 నుంచి ఆర్టీసీలో డ్రైవింగ్ శిక్షణ

అరసవల్లి: ఏపీఎస్‌ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో జూన్ 10వ తేదీ నుంచి 16వ బ్యాచ్‌కు డ్రైవింగ్‌పై శిక్షణ ఇవ్వనున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి విజయకుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు 15 బ్యాచ్‌లకు విజయవంతంగా శిక్షణ ఇవ్వడం జరిగిందని, శిక్షణ తీసుకున్న ప్రతీ ఒక్కరికీ సర్టిఫికెట్‌తో పాటు హెవీ లైసెన్సులు అందజేశామన్నారు. మారుతున్న డ్రైవింగ్ విధానాలకు అనుగుణంగా, మంచి అనుభవం కలిగిన ఇన్‌స్ట్రక్టర్లతో అత్యున్నతమైన విలువల కలిగిన శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. లైట్ వెహికల్ లైసెన్స్ ఒక సంవత్సరం కలిగిన వారందరూ అర్హులని, ప్రతీ బ్యాచ్‌కు 16 మంది మాత్రమే ఉంటారని, ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. శిక్షణలో మెకానికల్ వర్క్‌తో పాటు, విడిభాగాలు, యోగా, వ్యక్తిత్వ వికాసం, రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు, తదితర విషయాలపై పూర్తి స్థాయిలో శిక్షణ ఇస్తామన్నారు. ఫీజు, ఇతర వివరాలకు 99630 91999, 7382923293 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

కౌంటింగ్ కేంద్రానికి మార్గం ఇదే

- దిశా నిర్దేశం చేసిన ఎస్పీ రాధిక


ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైం: సార్వత్రిక ఎన్నికలు పూర్తయి.. మరి కాసేపట్లో ప్రారంభం కానున్న ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఎచ్చెర్లలోని శివానీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రానికి చేరుకునే కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు, పోటీ చేసిన అభ్యర్థులు చేరుకునే మార్గ నిర్దేశాలను ఎస్పీ జీఆర్ రాధిక సోమవారం రాత్రి ఓ ప్రకటనలో వెల్లడించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానున్న తరుణంలో కౌంటింగ్ కేంద్రానికి రెండు కిలోమీటర్ల మేర రెడ్‌జోన్‌గా ప్రకటించామని, అనుమతి లేనిదే ఈ ప్రాంతంలోకి ఎవరూ రాకూడదని ఎస్పీ పేర్కొన్నారు. శ్రీకాకుళం నుంచి ఎచ్చెర్ల శివానీ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాలకు చేరుకునేందుకు వెళ్లే కౌంటింగ్ సిబ్బంది, పోటీ చేసిన అభ్యర్థులు ఎన్‌హెచ్-16 మీదుగా కింతలి మిల్లు జంక్షన్ వద్ద సర్వీసు రోడ్డులోకి ప్రవేశించి ఎచ్చెర్ల పోలీసు స్టేషన్ మీదుగా అంబేడ్కర్ యూనివర్సిటీ దాటిన తర్వాత శివానీ ఇంజనీరింగ్ కళాశాల దగ్గర అండర్ ఫ్లై ఓవర్‌కు చేరుకోవాలన్నారు. అక్కడ పోటీచేసిన అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు, సిబ్బంది గుర్తింపు కార్డులు తనిఖీ చేసిన తర్వాత కళాశాల లేఅవుట్ మీదుగా పార్కింగ్ స్థలానికి చేరుకుంటారన్నారు.

- ఎచ్చెర్ల పోలీసు స్టేషన్ మీదుగా చిలకపాలెం వైపు ఎలాంటి హెవీ వెహికల్స్ అనుమతించడం లేదన్నారు. సాధారణ ప్రయాణికుల వాహనాలు శివానీ కళాశాల వద్ద ఉన్న అండర్ ఫ్లైఓవర్ నుంచి చిలకపాలెం సర్వీసు రోడ్‌లో ఎదరు రోడ్డు ద్వారా అనుమతిస్తామన్నారు. శ్రీకాకుళం ఎచ్చెర్ల నియోజకవర్గాలకు చెందిన కౌంటింగ్ సిబ్బంది, పోటీ చేసిన అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు గేట్ నెం-1 నుంచి ఫార్మసీ బ్లాక్ కౌంటింగ్ సెంటర్‌కు చేరుకోవాలన్నారు.
- ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, నరసన్నపేట, ఆమదాలవలస, పాతపట్నం నియోజకవర్గాలకు చెందిన కౌంటింగ్ సిబ్బంది గేట్-2 ద్వారా కళాశాలలోని ట్రిపుల్ ఐటీ బ్లాక్‌లో గల కౌంటింగ్ సెంటర్‌కు చేరుకుంటారని ఎస్పీ వివరించారు.
- ఇచ్ఛాపురం పలాస, టెక్కలి, నరసన్నపేట, ఆమదాలవలస, పాతపట్నం నియోకవర్గాలకు చెందిన పోటీ చేసిన అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు గేట్-3 నుంచి కళాశాలలోని ట్రిపుల్ ఐటీ బ్లాక్ వద్ద ఉన్న కౌంటింగ్ సెంటర్‌కు చేరుకోవాలని సూచించారు.
- కౌంటింగ్ సిబ్బంది, పోటీ చేసే అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లకు చెందిన వాహనాలను గేట్-2 ద్వారా లోపలికి వచ్చి లేఅవుట్‌లో వారికి కేటాయించిన స్థలాల్లో పార్కింగ్ చేయాలన్నారు.
- గుర్తింపు పాసులు కలిగిన మీడియా ప్రతినిధులు కళాశాల మెయిన్ గేట్ ద్వారా లోపలికి వచ్చి వారికి కేటాయించిన స్థలంలో వాహనాలను పార్కింగ్ చేయాలన్నారు.
- కౌంటింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం పోటీ చేసిన అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లు కౌంటింగ్ సిబ్బంది తమ వాహనాలను చిన్నరావుపల్లి జంక్షన్-అజ్జరాం కూడలి నుంచి ఎన్‌హెచ్-16 మీదుగా శ్రీకాకుళం చేరుకోవాలని కోరారు.
- కౌంటింగ్ సెంటర్‌లోకి ప్రవేశించిన కౌంటింగ్ ఏజెంట్లు, సిబ్బంది, పోటీ చేసే అభ్యర్థులకు సెల్‌ఫోన్‌ల అనుమతిలేదన్నారు. అందువల్ల సెల్‌ఫోన్స్ తీసుకురావద్దని సూచించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా సాగేలా అభ్యర్థులు, ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బంది, ప్రజలు సహకరించాలని ఎస్పీ కోరారు.